క్లుప్తంగా

గణనాథుడికి మాజీ ఎమ్మెల్యే పూజలు


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని దిన్నెపాడు గ్రామం బెస్తపల్లిలో వెలసిన గణనాథుడికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు జడ్జి జింకారెడ్డి శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గజేంద్రారెడ్డి, మీరావలి, మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సెలింగ్‌ను రద్దుచేయాలి

రాయచోటి అర్బన్ : రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం కలిగించేలా సాగుతున్న మెడికల్ కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని కేవీపీఎస్ జిల్లా కో–కన్వీనర్ డీసీ వెంకటయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రెండో విడత మెడికల్ కౌన్సెలింగ్ దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా ఉందన్నారు. ఇప్పటికే 107, 108 జీఓల ద్వారా మెడికల్ సీట్లలో రిజర్వేషన్ విద్యార్థులకు కోత విధించడం అన్యాయమన్నారు. తక్కువ ర్యాంకులు వచ్చిన రిజర్వేషన్ విద్యార్థులకు ఓపెన్ కేటగిరిలో కాకుండా రిజర్వేషన్ కేటగిరిలో సీట్లను కేటాయిస్తుండడం దారుణమన్నారు. రిజర్వేషన్ విద్యార్థులకు అన్యాయం కలిగించేలా సాగుతున్న మెడికల్ కౌన్సెలింగ్‌ను వెంటనే రద్దుచేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు.

కుస్తీ పోటీల్లో ఏఐటీఎస్ విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : విశాఖపట్నం జిల్లా మధురవాడ పరిధిలోని చంద్రపాళెంలో ఈనెల 23, 24 తేదీలలో నిర్వహించిన మూడవ రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలలో ఏఐటీఎస్ విద్యార్థులు ఒక బంగారు పతకం, ఆరు రజత పతకాలను సాధించారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ 58 కేజీల విభాగంలో నరసింహ, పవన్‌రెడ్డి బంగారు పతకం సాధించారన్నారు. సాయి విఘ్నేశ్వరరెడ్డి, దినేష్‌కుమార్, హరినాథ్‌నాయుడులు రజత పతకాలను సాధించారన్నారు. కార్యక్రమంలో పీడీ నాగమునిరెడ్డి పాల్గొన్నారు. కాగా విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈనెల 28 నుంచి అక్టోబరు 2వతేదీ వరకు గుజరాత్‌లో జరిగే మూడవ జాతీయస్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీలలో పాల్గొననున్నారు.

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం


లక్ష్మీ ప్రసన్నను సత్కరిస్తున్న ఎంపీపీ మేడా

నందలూరు (రాజంపేట) : ఏపీపీఎస్సీలో మూడవ ర్యాంకు సాధించిన చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కంబాలకుంట లక్ష్మీ ప్రసన్న సోమవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలువగా ఆయన శాలువతో ఆమెను సత్కరించారు. గతంలో లక్ష్మీ ప్రసన్న టీపీపురం పంచాయతీలో సెక్రటరీగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, బీసీ నాయకుడు గోపినేని హిమగిరి యాదవ్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు చలపాటి నరసింహులు, సుబ్బారెడ్డి, ఓర్సు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి


దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ 108వ జయంతిని పురస్కరించుకుని కిషన్ మోర్చా హార్టికల్చర్ స్టేట్ కన్వీనర్ తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఆయన రచించిన సిద్ధాంతాలనే ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టతకు పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయప్రకాశ్‌వర్మ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊటుకూరు చలపతి, మల్లికార్జున, సుబ్రమణ్యం, శంకర్‌రాజు, లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుందాం


చిన్నమండెం: ర్యాలీ అనంతరం మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు


లక్కిరెడ్డిపల్లె: నా భూమి - నా దేశం విశిష్టతను వివరిస్తున్న దృశ్యం

చిన్నమండెం : ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన మేరా దేశ్ - మేరా మిట్టి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకొని వారి అడుగుజాడల్లో నడవాలని ప్రధానోపాధ్యాయురాలు సర్తాజ్‌బేగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులందరూ జాతీయ నాయకుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ, జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మేరీ మిట్టి.. మేరా దేశ్

లక్కిరెడ్డిపల్లె : మండలంలో నా భూమి - నా దేశం అమృత్ కలశ యాత్ర కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, ఎంపీడీఓ వెంకట రమణారెడ్డి, ఎంఈఓ చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన అమృత్ కలశ యాత్రలో భాగంగా దేశ రక్షణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులకు గౌరవ సూచకంగా ఢిల్లీలోని జాతీయ యుద్ధస్మారక స్థూపం పక్కన అమృత్ వాటిక పేరుతో ప్రత్యేక స్థూపాన్ని నిర్మించనున్నారు. ఈ స్థూపానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 7500 కలశాలలో సేకరించిన మట్టిని అమృత్ వాటిక స్థూపం నిర్మాణానికి వినియోగించనున్నారు. ఇందులో భాగంగా లక్కిరెడ్డిపల్లె మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టి, మొక్కలను పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి మూడురోడ్ల కూడలి నుంచి ఎంఆర్‌సీ, ఎంపీడీఓ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ ప్రత్యేక కార్యక్రమం గురించి విద్యార్థులకు వివరించి వారిని భాగస్వాములను చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల బాలుర, బాలికల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మచ్చారెడ్డన్న, అస్మత్ బాషా, మేమిరెడ్డి సుబ్బారెడ్డి, సుజాత, రెడ్డమ్మ, నారాయణ నాయక్, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పెనగలూరు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎస్ఆర్ పురం హైస్కూల్‌లో..

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురం హైస్కూల్‌లో సోమవారం ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా మేరీ మిట్టి - మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణాలు అర్పించిన వారికి, రక్షణ సిబ్బందికి, పోలీసు అమరవీరులకు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి వలసవాద మనస్తత్వ భావజాలాన్ని వీడాలన్నారు. జాతీయ ఐక్యతను బలోపేతం చేయాలన్నారు. వలసాని స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్, చంద్రశేఖర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై 2022–23 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు రమణ, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీదేవి, శశిధర్‌లు పాల్గొన్నారు.

ఈ క్రాప్ పరిశీలన


ఈ క్రాప్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలో జరుగుతున్న ఈ క్రాప్ సామాజిక తనిఖీని డివిజనల్ వ్యవసాయాధికారిణి శ్రీలత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు తప్పకుండా పంట నమోదును ఆర్బీకే వీఏఏల ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు వలన ప్రభుత్వం ద్వారా అందించే పలు పథకాలు వర్తించేందుకు అర్హులవుతారన్నారు.

వైద్యానికి రూ. 30 వేలు వితరణ

చిట్వేలి : వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వ్యక్తికి ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయి వికాస్‌రెడ్డి సోమవారం రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లి పంచాయతీకి చెందిన మోడపోతుల నరసింహులు లివర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉండటాన్ని ఇతరులు ద్వారా తెలుసుకున్న ముక్కా సాయివికాస్ రెడ్డి సోమవారం బాధితుడికి చికిత్స నిమిత్తం రూ. 30 వేలు విలువచేసే చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, రమణ, రాజు ప్రతాప్, పరశురాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాలనను చేరువ చేసేందుకే సచివాలయాలు

అనంతంపల్లిలో సచివాలయాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి


అనంతంపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి

పెనగలూరు : గ్రామీణుల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారికి ప్రభుత్వ పాలనను చేరువ చేయడంలో సచివాలయాలు ఉపయోగపడుతున్నాయని పెనగలూరు వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి అన్నారు. మండలంలోని అనంతంపల్లి పంచాయతీలో సోమవారం సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మండలంలోని 14 సచివాలయాలు ఉండగా మొదటి సచివాలయాన్ని అనంతంపల్లిలో ప్రారంభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి గ్రామాలలోనే సమస్యలు తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ సచివాలయ వ్యవస్థను ప్రారంభించారన్నారు. సచివాలయ వ్యవస్థ ప్రారంభించడంతోపాటు లక్షలాది మందికి ఉద్యోగాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. త్వరలో భూముల రిజిస్ట్రేషన్‌లు సైతం సచివాలయంలోనే చేసుకునే ఏర్పాట్లు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రజలు గర్వపడాలన్నారు. అలానే రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. విత్తన పంపిణీ నుంచి మార్కెటింగ్ వరకు రైతులకు సాగు మెళకువలు తెలియజేస్తూ వారికి అండగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమై సచివాలయం పరిధిలో ప్రజలకు కావాల్సిన సేవలను ఎప్పటికప్పుడు అందించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బరాయుడు, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ పి.పార్వతి, మాజీ ఎంపీటీసీ పి.రామ్మోహన్ నాయుడు, అనంతంపల్లి మాజీ సర్పంచ్ వెంకటస్వామి నాయుడు, ఎంపీటీసీ జగదీష్, కాంట్రాక్టర్‌లు పేరం రెడ్డయ్య నాయుడు, పేరం కృష్ణయ్య నాయుడు, విద్యుత్ కాంట్రాక్టర్ శ్రీనివాసులు నాయుడు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సిపి మండల కన్వీనర్ కేతా చక్రపాణి, ఏఈ గంగులయ్య, వైఎస్సార్ సిపి యువనాయకుడు హరీష్ నాయుడు, వీఆర్ఓ పెంచలయ్య, పంచాయతీ సెక్రటరీ సునీత, ఆంజనేయులు రెడ్డి, ధనుంజయరెడ్డి, సానారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాజంపేట: జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


రైల్వేకోడూరు: ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

నందలూరు (రాజంపేట) : రాజంపేట పట్టణంలోని క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఎంపికలలో మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను చూపి వివిధ క్రీడలలో జిల్లాస్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రోబాల్ అండర్–17 విభాగంలో హేమలత, జి.మల్లికార్జున, యు.నాని, పి.శివ మణికంఠ, త్రోబాల్ అండర్–14 పోటీలకు శ్రావణి, జోసఫ్, సుబ్రమణ్యం, భావన, పెంచలయ్య, వెంకటేష్, పవన్ కుమార్, కబడ్డీ అండర్–14 జట్టుకు శ్రావణి, వెంకటేష్, శైలజ, వాలీబాల్ అండర్–14 జట్టుకు పవన్ కుమార్‌లు ఎంపికయ్యారన్నారు. అనంతరం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సరిత, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌లో కోడూరు విద్యార్థులు

రైల్వేకోడూరు : పుల్లంపేటలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికల్లో రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.ఇందు, కె.విష్ణులు ఉమ్మడి కడప జిల్లాకు ఎంపికైనట్లు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.వి. విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే సాఫ్ట్‌బాల్, కడప జిల్లాలో జరిగే బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు. వ్యాయామ అధ్యాపకులు చంద్రమోహన్‌రాజు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె నుంచి సాఫ్ట్ బాల్ పోటీలకు..

ఓబులవారిపల్లె : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ అండర్–19కు వైకోట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–19 పోటీలలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌కు సంబంధించి పాఠశాలకు చెందిన శివబాలాజీ, జశ్వంత్, శరణ్, మదన్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పాఠశాల విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు అహర్నిశలు కృషిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్లాను అభినందించారు.


ఓబులవారిపల్లె: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన వైకోట క్రీడాకారులు

జీపీఎస్ అమలును ఉపసంహరించుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నేతలు

రాయచోటి అర్బన్ : సీపీఎస్‌ను రద్దుచేసి జీపీఎస్‌ను అమలు చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఫ్యాప్టో నేతలు జాబీర్, శివారెడ్డిలు డిమాండ్ చేశారు. జీపీఎస్ అమలు నిర్ణయాన్ని నిరసిస్తూ ఉద్యోగులు సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఓపీఎస్ ముగిసిన అధ్యాయమని మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడడం దారుణమన్నారు. లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా మారిన పాతపెన్షన్ విధానం అమలుపట్ల మంత్రి బొత్స నిర్లక్ష్యంగా మాట్లాడడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికున్న వైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. పాతపెన్షన్ విధానమే తమకు కావాలని, జీపీఎస్ అమలును అంగీకరించే ప్రసక్తే లేదని తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు సబాతుర్ రహిమాన్, రవీంద్రారెడ్డి, గోపాల్, శివయ్య, జయన్న, దుర్గేశ్వరరాజు, మున్వర్, వెంకట్రామిరెడ్డి, గోపి, నాగరాజు, వాసుదేవరెడ్డితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేస్ కాలనీ రిక్రియేషన్ అధ్యక్షుడిగా ఎరుకలరెడ్డి



సుండుపల్లె(రాజంపేట) : హైదరాబాదులోని ఎమ్మెల్యేస్ కాలనీ రిక్రియేషన్ సెంటర్‌కు జరిగిన ఎన్నికల్లో రాయచోటి తొలి ఎమ్మెల్యే యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి కుమారుడు డా.యర్రపురెడ్డి ఎరుకలరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికలలో 234 ఓట్ల మెజార్టీతో గెలుపొందారని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. సుండుపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన ఎరుకలరెడ్డికి పలువురు అభినందనలు తెలియచేశారు.

జగనన్నకు చెబుదాం అర్జీలను పరిష్కరించండి


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ

పెనగలూరు : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై సర్వే నిర్వహించాలని మండల డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్ఓలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్డీఓలు హాజరయ్యారని, వారి సమక్షంలో 70 అర్జీలు వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చారని, ఒక్కొక్క పంచాయతీకి సంబంధించిన అర్జీలు సంబంధిత వీఆర్ఓకు బదిలీ చేశామన్నారు. ఈ అర్జీలపై మూడు రోజులలో సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించేలా ఉంటే ఆ సమస్య పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. కొంతమంది ఇంటిస్థలాలు అడిగారని, ఆ ఇంటిస్థలాలు జగనన్న కాలనీలలో ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, విఆర్ఓలు పాల్గొన్నారు.

సౌమ్యనాథునికి పవిత్రమాలల సమర్పణ


పవిత్రమాలలను తీసుకొస్తున్న అర్చకులు


స్వామివారికి పవిత్రమాలలను సమర్పించిన దృశ్యం

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామి పవిత్రోత్సవాలను పురస్కరించుకొని సోమవారం సౌమ్యనాథుడికి పవిత్రమాలల సమర్పణను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి, సౌమ్యనాథుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలతో మాలలను అలంకరించారు. అంతకముందుంగా ఉత్సవమూర్తులకు అభిషేకం జరిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, టీటీడీ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



సిద్దవటం : మండల కేంద్రం పరిధిలోని ఎగువపేటలో ఉన్న ఫత్తుమియ్యా దర్గాలో మిలాద్–ఉన్–నబి సందర్భంగా సోమవారం గంధం మహోత్సవాన్ని నిర్వహించినట్టు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ గంధంను ఆసారే షరీఫ్ ఇంటి వద్ద నుంచి మేళతాళలతో ఊరేగింపుగా దర్గాకు చేరిందన్నారు. అక్కడ గంధంను ఫతేహా నిర్వహించామన్నారు. మంగళవారం ఉరుసు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శిస్తారని అన్నారు. ఉరుసు మహోత్సవానికి భక్తులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

‘అంగన్‌వాడీల అరెస్టు అప్రజాస్వామికం’


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రాయచోటి అర్బన్ : చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమవుతున్న అంగన్‌వాడీలను పోలీసులు బెదిరించడం, అక్రమంగా నిర్బంధించడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, నేతాజీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎ.రామాంజులు, సాంబశివలు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పోలీసులు రెండురోజుల ముందే అంగన్‌వాడీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. ప్రభుత్వం స్పందించి అక్రమ అరెస్టులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల జీతాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, ఖాజా బీ, సిద్ధమ్మ, నాగమణి, రైతు సంఘం నేత రంగారెడ్డి, సుధీర్‌కుమార్, కార్యదర్శి సురేష్‌కుమార్‌తోపాటు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టండి


డీటీకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఒంటిమిట్ట : కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టి, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.నరసయ్య, రైతు సంఘం మండల నాయకులు పి.పుల్లయ్య, సాంబయ్యలు కోరారు. సోమవారం వారు మండల డిప్యూటీ తహసీల్దార్ అయుబ్ ఖాన్‌ని కలిసి ఈ విషయమై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు స్కిల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటను బట్టి ఎకరాకు రూ. 40 వేలు నుంచి 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, పంట వేయని రైతులకు ఎకరాకు రూ. 20 వేలు జీవన భృతి ఇవ్వాలన్నారు. వ్యవసాయ మోటర్లుకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందించి ఉన్న పంటలను కాపాడాలన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికను రూపొందించి రబీలో పంట వేసేందుకు 90 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం విత్తనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతులు శివప్రసాద్, గంగయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

పరామర్శ

నందలూరు (రాజంపేట) : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆనాల చంటయ్య అనారోగ్యానికి గురై తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి రావడంతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పుత్త శంకర్, గుండు మల్లికార్జున రెడ్డి, కుర్రా మణి యాదవ్, అరిగే మణి, ఆనాల మధు, ఆనాల మాధవ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా చేపట్టండి


మాట్లాడుతున్న డీఎల్‌ఓ జ్ఞానదేవ్‌రెడ్డి

చిన్నమండెం : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని డీఎల్‌ఓ జ్ఞానదేవ్‌రెడ్డి సూచించారు. సోమవారం పథకంపై వైద్య సిబ్బందికి దేవగుడిపల్లె సచివాలయంలో ఎంఎల్‌ఓ దివాకర్‌నాయక్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ప్రతి ఒక్కరూ విధిగా భావించి విజయవంతం చేయాలన్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలని సూచించారు. అనంతరం పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ దివాకర్‌నాయక్, జేసీఎస్ మండల ఇంచార్జ్ చుక్కా అంజనప్ప, కన్వీనర్లు జయశంకర్‌రెడ్డి, రమణ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన ఎస్పీ క్రిష్ణారావు

పెద్దమండ్యం: తంబళ్లపల్లె, పెద్దంమడ్యం, ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ బొడ్డేపల్లె క్రిష్ణారావు సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లో ఉన్న గదులను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలు, గ్రామాల పరిస్థితిపై ఆరా తీశారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలు, రౌడీ షీటర్‌లు, సస్పెక్టెడ్ షీట్ ఉన్న వారిపట్ల నిఘా ఉంచాలని సూచించారు. ఎస్పీ వెంట మదనపల్లె డీఎస్పీ కేశప్ప, ములకలచెరువు ఇన్‌చార్జి సీఐ శివాంజనేయులు, ఎస్ఐలు రామాంజనేయుడు, గాయత్రి, లోకేష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

రాయచోటి అర్బన్ : అన్నదానం ఒక పుణ్యాకార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదానం కార్యక్రమం 36వ సోమవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా మహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ఎంతో గొప్ప సదుద్దేశంతో గ్రీవెన్స్‌సెల్ అర్జీదారుల కోసం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి నిర్వహింపజేస్తున్న అన్నదానంను అర్జీదారులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుగవాసి శ్యామ్‌కుమార్, అమీర్, జావీద్, బేపారి జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

అఖండ రామనామ సంకీర్తన చేయాలి


మాట్లాడుతున్న పీఠాధిపతి విజయ శంకర్ స్వామి

ఒంటిమిట్ట : ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, రైతులు పాడిపంటలతో ఆనందంగా ఉండేందుకు అఖండ రామ నామ సంకీర్తన చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర్ స్వామి కోరారు. సోమవారం మండల కేంద్రంమైన ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద జాపద గురువులు, భజన బృంద లీడర్లతో విజయ శంకర్ స్వామి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 19, 20వ తేదీలలో ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో అఖండ రామనామ సంకీర్తన చేయాలని నిర్ణయించారు. ఈ రామనామ సంకీర్తన యజ్ఞంలో అందరూ పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరారు.